క్లుప్తంగా

లింగాలవలసలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ పుష్పాంజలి

గజపతినగరం: మండలంలోని లింగాలవలస గ్రామంలో శనివారం 104 వైద్యశిబిరం నిర్వహించారు.మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి, సిబ్బంది శిబిరంలో 55 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

పల్లె వెలుగు బస్సు పార్రంభం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపోలో కొత్త పల్లెవెలుగు బస్సును ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. అందులో భాగంగానే కొత్త బస్సులను కొనుగోలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కె.రమేష్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ



పంటకోత ప్రయోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జామి: మండలంలోని వీఏఏలు, వీఆర్‌ఓలు, గ్రామసర్వేయర్లకు పంటకోత ప్రయోగాలపై స్థానిక రైతు సేవా కేంద్రంలో అధికారులు శనివారం శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ కృష్ణలత మాట్లాడు తూ పంటకోత ప్రయోగాలను అనుసరించే ఉచిత బీమా పథకం వర్తిస్తుందన్నారు. పంట దిగు బడి ఆధారంగా ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రోత్సాహాలు అందుతాయని చెప్పారు. పంటకోత ప్రయోగాలు చేసేందుకు వచ్చే సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. పంటకోత ప్రయో గాలు చేసే విధానాన్ని వ్యవసాయశాఖ సిబ్బంది వివరించారు. ఏఎస్‌ఓ శాంతి, ఆర్‌ఐ సృజన పాల్గొన్నారు.

సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి



తహసీల్దార్ విజయభాస్కర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేషన్ డీలర్లు

దత్తిరాజేరు: నిర్ణీత గడువులోగా రేషన్ సరుకులు విడిపించి, లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేయాలని తహసీల్దార్ విజయభాస్కర్ రేషన్ డిపోల డీలర్లకు సూచించారు. మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు పాలూరి అప్పారావు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల డీలర్లు తహసీల్దార్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. తహసీల్దార్‌గా విజయభాస్కర్ బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారి కలవడంతో డీలర్లు పుష్పగుచ్ఛాలు అందజేసి తమని పరిచయం చేసుకున్నారు. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు రాకుండా పని చేయాలని డీలర్లకు తహసీల్దార్ సూచించారు. అలాగే శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన సీఎస్‌డీటీ సత్యనారాయణను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రేపటి నుంచి శిక్షణ తరగతులు

గజపతినగరం: గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు 2024- 25 ఆర్థిక సంవత్స రానికి సంబంధించి ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికపై ఈనెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ బి.కల్యాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతీ గ్రామ పంచా యతీ నుంచి ఉప సర్పంచ్, ఇద్దరు వార్డ్ మెంబర్లకు మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.15 గ్రామ పంచాయతీలకు చొప్పున రెండు విడతల్లో శిక్షణ ఇస్తామని, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు హాజరు కావాలని కోరారు.

జామి మండలంలో..

జామి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం, వెలుగు కార్యాలయాల్లో సోమ, మంగళ వారాల్లో పంచాయతీ ఉపసర్పంచ్‌లు, ఒక్కో పంచాయ తీ నుంచి ఇద్దరు వార్డు మెంబర్లకు ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ అప్పలనాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

దత్తిరాజేరులో 9,10వ తేదీల్లో..

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 9,10వ తేదీల్లో ఉప సర్పంచ్‌లు, పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు మెంబర్లకు ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ ఇవ్వనున్నామని ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్ శనివారం తెలిపారు. తొలిరోజు 18 పంచాయతీల ఉప సర్పంచ్,వార్డ్ మెంబర్లకు, రెండో రోజు 17 పంచాయతీల వారికి శిక్షణ ఇస్తామని, ఉపసర్పంచ్‌లు, వార్డుమెంబర్లు హాజరు కావాలని పేర్కొన్నారు.

కాన్వెంట్ తరహా బోధనకు మంగళం..!

- అంగన్‌వాడీ చిన్నారులకు అందని పుస్తకాలు
- పిల్లలకు పీపీ-1,2 కిట్ల పేరిట పుస్తకాలు అందజేసిన గత ప్రభుత్వం
- ఈ ఏడాది నేటికీ పుస్తకాలు సరఫరా చేయని కూటమి సర్కారు



గంట్యాడ మండలం కితుబర్తి అంగన్‌వాడీ కేంద్రంలో పలకలపై రాస్తున్న చిన్నారులు

గంట్యాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందించాల్సి ఉంది. కేంద్రాలకు మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు వస్తుంటారు.బాల్యదశలోనే విజ్ఞానం పెంపొందించడంతో పాటు ఆంగ్ల మాధ్యమం అలవాటు చేసి, అంగ్లంపై పిల్లలు పట్టు సాధించేలా వారి చదు వుకు బలమైన పునాదులు వేయాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.అందులో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పూర్వ ప్రాథమిక విద్య(ప్రీ ప్రైమరీ ఎడ్యు కేషన్) కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలతో పాటు ఆటపరికరాలు అందించారు. నాలుగేళ్ల లోపు పిల్లలకు ఇంగ్లిష్, మ్యాథ్స్, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించి బడ్స్ పేరుతో అయిదు పుస్తకాలతో కూడిన పీపీ(ప్రీ ప్రైమరీ)-1 కిట్లను, నాలుగు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు అయిదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్లు ఏటా అందజేసేవారు. ఆ పుస్తకాల ఆధారంగానే పిల్లలకు అంగన్‌వాడీ కార్యకర్తలు బోధన చేసేవారు. దీంతో వారికి చాలా సులభంగా, అర్థమయ్యే రీతిలో బోధన సాగేది. కాన్వెంట్ స్కూళ్ల తరహా బోధన గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతుండడంతో గత ప్రభుత్వంలో ఈకేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నేటికీ అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాలు సరఫరా చేయలేదు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు పాత పుస్తకాలతో బోధన చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతు న్న కాన్వెంట్ తరహా బోధనకు మంగళం పాడేలా, పుస్తకాల సరఫరాను నిలిపివేసి పాతవిధానాన్ని అమల్లోకి తెచ్చే ఆలోచనతో కూటమి సర్కారు వ్యవహరిస్తోందన్న విమర్శ లు పిల్లల తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గంట్యాడ మండలంలో 96, బొండపల్లి మండలంలో 70 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 2,433 మంది, మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు 1,550 మంది ఉన్నారు. మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లల అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తుంటారు. వీరందరికీ ప్రభుత్వం పుస్తకాలు సరఫరా చేయాల్సి ఉంది.



గతేడాది ప్రభుత్వం అందజేసిన పీపీ-1, 2 పుస్తకాలు

వచ్చిన వెంటనే అందిస్తాం..

అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు సంబంధించిన బడ్స్ పీపీ-1, పీపీ-2 పుస్తకాలు ఇంకా రాలేదు. పుస్తకాలు వచ్చిన వెంటనే కేంద్రాలకు చేరవేసి వాటిని పిల్లలకు అందిస్తాం.

– దోకుల ఉమాభారతి, గంట్యాడ ఐసీడీఎస్ పీఓ

తాత్కాలిక కోర్టు భవనం ప్రారంభం



కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి కల్యాణచక్రవర్తి, ఎస్.కోట జడ్జి వాణి

శృంగవరపుకోట: పట్టణంలో ప్రస్తుతం ఉన్న కోర్టు భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అన్ని వసతులు ఉన్న అద్దె భవనంలోకి కోర్టును మార్చాలని జిల్లా న్యాయమూర్తి గతంలో స్థానిక కోర్టు జడ్జిని ఆదేశించా రు.దీంతో ఎస్.కోట ప్రధాన రహదారిలో అద్దెకు తీసుకున్న భవనంలో తాత్కాలికంగా కోర్టు ఏర్పాటు చేశా రు.కోర్టు భవనాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి, స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఎస్. వాణితో కలిసి శనివారం ప్రారంభించారు. జిల్లా న్యాయమూర్తికి వేదపండితులు పూర్ణకలశంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత్కాలిక కోర్టు భవనంలో అన్ని వసతులు ఉన్నాయని, న్యాయవాదులు, కక్షిదారులు ఎవ్వరూ ఇబ్బందిపడని విధంగా కోర్టు ప్రాంగణాన్ని ఎంపిక చేయడంలో సహకరించిన స్థానిక న్యాయవాదులను అభినందించారు. త్వరితగతిన శాశ్వత కోర్టు భవనాలు పూర్తి చేయించేందుకు సహకారం అందిస్తామని చెప్పారు. కేసుల పరిష్కారంలో కూడా ఇదే స్ఫూర్తి, చొరవ చూపాలని కోరారు. న్యాయవాది దుర్గాప్రసాద్ దంపతులు దక్షిణామూర్తి పూజ, గణపతి హోమం పూజలు చేశారు. ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిదేముడు, బి.సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు ఏ.సత్యాజీ, కామేశ్వరరావు, న్యాయవాదులు ఎస్.టి.వి.దాసు, జి.ప్రకాశ్, టి.టి.వి.రమణాజీ, బి.త్రిమూర్తులు, డబ్ల్యూ.ఎస్.శర్మ, వి.ఈశ్వరరావు, టి.వి.ఆర్.మూర్తి, బి.వి.ఎస్.రామారావు, అనూరాధ, ఆర్.సత్యనారాయణ, సీహెచ్.ఆర్.ఏ.నాయుడు, బి.వెంకటరావు, బి.రామకృష్ణ, ఎస్.కోట సీఐ వి.ఎస్.మూర్తి,కోర్టు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మినీగోకులాలపై స్పష్టత ఇవ్వండి



ఈసీ జోగారావును ప్రశ్నిస్తున్న సర్పంచ్ పాపునాయుడు

గంట్యాడ: పంచాయతీకి ఎన్ని మినీగోకులాల షెడ్లు మంజూరు చేస్తారో స్పష్టత ఇవ్వాల ని, అలా కాకుండా మినీగోకులాలు నిర్మించేసుకోండి అని రైతులకు చెప్పేసి వెళ్లి పోతే సరికాదని ఉపాధి హామీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్(ఈసీ) జోగారావును పెదవేమలి గ్రామ సర్పంచ్ పాపునాయుడు నిలదీశారు. పెదవేమలి గ్రామంలో ఉపాధి హామీ పనులపై శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధి హామీ ఈసీ మాట్లాడుతూ పాడిరైతులు మినిగోకులాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీనికి సర్పంచ్ స్పందిస్తూ ''మినీగోకులాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మీరు చెప్పేసి వెళ్లిపోతారు. ఆ తర్వాత మీరు ఒకటో, రెండో ఇస్తే మిగతా రైతులు మమ్మల్ని అడిగితే మేం ఏం సమాధానం చెప్పాలి. ఎన్ని గోకులాలు మంజూరు చేస్తారో, దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇస్తారో లేదో స్పష్టంగా చెప్పండి' అని కోరారు. ఈసీ స్పందిస్తూ ప్రస్తుతానికి మండలానికి 26 మినీగోకులాలు మాత్రమే మంజూరయ్యాయని చెప్పారు. సర్పంచ్ మాట్లాడుతూ మండలంలో 36 పంచాయతీలు ఉన్నాయని, 26 మంజూరు అయితే గ్రామానికి ఒకటి కూడా రాదు కదా అని ప్రశ్నించారు. దీంతో సమాధానం చెప్పలేక ఈసీ మిన్నుకుండిపోయారు. గ్రామంలో ఎవరైనా మినీగోకులాలు ఏర్పాటు చేసుకోవాలనుకుంటే పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. ఎంపీటీసీ పాటువు రెడ్డి భవాని, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరావు, ఫీల్డ్ అసిస్టెంట్ వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి



వల్లంపూడిలో వరిపంట వివరాలను సూపర్ చెక్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రామారావు

వేపాడ: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి వి.టి.రామారావు సూచించారు. మండలంలోని వేపాడ, వల్లంపూడి, దబ్బిరాజుపేట గ్రామాల్లో వరి, తదితర పంటలను పరిశీలించారు. పంటల వివరాలను సూపర్ చెక్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఈసందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగులో పాటిస్తున్న పద్ధతులు, సేంద్రియ ఎరువులు, కషాయాలు, ద్రవ, ఘన జీవామృతాల వినియోగంపై ఆరా తీశారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా రైతులకు పెట్టుబడి సహాయం విడుదల చేసిన సందర్భంగా ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని దబ్బిరాజుపేట రైతుసేవాకేంద్రంలో రైతులతో కలిసి టీవీలో ప్రత్యక్ష ప్రసారం చూశారు. మండలంలో వరి పంట ఈ-క్రాప్ నమోదు శతశాతం, ఈకేవైసీ 93 శాతం పూర్తయ్యిందని ఏఓ యశ్వంతరావు చెప్పారు. ఏడీఏ ఎల్.విజయ, ఎంపీఓ సి.బి.యశ్వంతరావు, రైతుసేవాకేంద్రాల వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ జి.ఎ.వి.రమణ

గజపతినగరం: మాదక ద్రవ్యాలు, మద్యం, ఇతర మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని గజపతినగరం సీఐ జి.ఎ.వి.రమణ సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్‌తో కలిగే అనర్థాలు, ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలపై మరుపల్లి గ్రామస్తులకు శనివారం సాయంత్రం అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులు డ్రగ్స్, మత్తుపదార్థాలకు బానిసగా మారి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని అన్నారు. పిల్లల ప్రవర్తన, వారి నడవడికను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు. గంజాయి, గుట్కా, ఖైనీ, సారా విక్రయించడం, రవాణా చేయడం వంటివి చేస్తే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్రవాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. రోజురోజుకీ సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతాల సమాచారం, ఏటీఎం నంబర్లు అడిగితే చెప్పవద్దన్నారు. అపరిచితుల నుంచి మొబైల్ ఫోన్లకు వచ్చే ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ లింక్‌లను ఓపెన్ చేయవద్దని వివరించారు. స్థానిక ఎస్‌ఐ కె.లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ శనివారం తెలిపారు. బీఏ పొలిటికల్ సైన్స్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బోటనీ, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ గ్రూపుల్లో మిగుల సీట్లను భర్తీ చేయనున్నామని చెప్పారు. ఆసక్తి గల విద్యా ర్థులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 99123 62922, 98663 39655 ఫోన్ నంబర్లను సంప్రదించా లని సూచించారు.


ఎన్‌సీసీ శిక్షణకు పయనం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎస్ఎంసీ చైర్మన్ సురేష్

చీపురుపల్లి: విద్యార్థులు జీవితంలో ఎదిగేందుకు ఎన్‌సీసీ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ గవిడి సురేష్ చెప్పారు. 3(ఏ) నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో పది రోజుల పాటు నిర్వహించనున్న ఎన్‌సీసీ శిక్షణకు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 52 మంది విద్యార్థులు శనివారం పయనమ య్యారు. విద్యార్థులతో బయలుదేరిన బస్సును గవిడి సురేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఎన్‌సీసీ అధికారి మామిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశభక్తి, క్రమ శిక్షణ, పరిశుభ్రత అనే అంశాలతో పాటు భారత త్రివిధ దళాలపై విషయ పరిజ్ఞానం, గన్ ఫైర్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తారని చెప్పా రు.ఉపాధ్యాయుడు ఆర్.చిట్టిబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



జామిలో మహిళలు ఏర్పాటు చేసి అన్నసమారాధనలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

బొండపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రం బొండపల్లిలోని చలుమూరి వీధిలో అమ్మవారి మండపం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. సుమారు 4వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

జామిలో..

జామి: దేవీ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవీగా దర్శనమిచ్చిన నేపథ్యంలో స్థానిక బజారు సెంటర్ వద్ద గోస్తనీ మహిళలు అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. గోస్తనీ యువత సహాయ సహకారాలు అందించారు.

బాధ్యతల స్వీకరణ



డీఎల్‌డీఓ హేమసుందరరావు

చీపురుపల్లి: డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారి(డీఎల్‌డీఓ)గా కె.హేమసుందరరావు నియమితులయ్యారు. స్థానిక డీఎల్‌డీఓ కార్యాలయంలో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం ఎంపీడీఓగా పనిచేసి ఇక్కడికి పదోన్నతిపై వచ్చారు.ఇది వరకు ఇక్కడ డీఎల్‌డీఓగా పనిచేసిన లక్ష్మణరావుకు కాకినాడ జెడ్పీ సీఈఓగా పదోన్నతి లభించింది.

గరివిడి ఎంపీడీఓగా సుబ్రహ్మణ్యం



ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా సుబ్రహ్మణ్యం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈఓపీఆర్డీ పుష్పాంజలి, పంచాయతీ కార్యదర్శులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

మండల పరిషత్ సూపరింటెండెంట్‌గా తులసీరావు



సూపరింటెండెంట్ తులసీరావుకు స్వాగతం పలుకుతున్న ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు

బొండపల్లి: మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా కె.తులసీరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. అలాగే ఈఓపీఆర్డీగా ఏ.రఘుపతిరావు బాధ్యతలు స్వీకరించారు.ఈయన శ్రీకాకుళం జిల్లాలోని మందస మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఈఓపీఆర్డీ సీహెచ్.సుగుణాకరరావుకు గజపతినగరం మండలం బదిలీ అయ్యింది. వెలుగు ఏపీఎంగా కె.పెంటంనాయుడు విధుల్లో చేరారు.మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు సీనియర్ సహాయకులు ఎస్.శ్రీనివాసరావు, సంతోష్‌కుమార్, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

చీపురుపల్లి ఎంపీడీఓగా సరళ



ఎంపీడీఓ సరళకు అభినందనలు తెలుపుతున్న కార్యాలయ సిబ్బంది

చీపురుపల్లి: మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా ఏ.సరళ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈమె నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఇది వరకు ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన కె.రామకృష్ణరాజుకు నెలిమర్ల మండలం బదిలీ అయ్యింది. ఎంపీడీఓ సరళకు కార్యాలయ ఏఓ ప్రవీణ్, టైపిస్ట్ సురేష్ ,సిబ్బంది అభినందనలు తెలిపారు.

పాతబగ్గాం వీఆర్‌ఓగా అప్పలనాయుడు



వీఆర్‌ఓ అప్పలనాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాతబగ్గాం గ్రామపెద్దలు

గజపతినగరం: మండలంలోని పాతబగ్గాం వీఆర్ఓగా చింత అప్పలనాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామసచివాలయంలో సర్పంచ్ లెంక పద్మావతి, పెద్దలు లెంక చిన్నం నాయుడు,కర్రి సన్యాసిరావు ఆయనకు స్వాగతం పలికారు.

● వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, నాయకులు

వేపాడ: నెడ్ క్యాప్ మాజీ డైరెక్టర్, జగ్గయ్యపేట గ్రామానికి చెందిన చలుమూరి పద్మావతి కుమారుడు రాజ్‌కుమార్‌కు అక్షితతో వివాహం జరిగింది. నూతన దంపతులను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం సాయంత్రం ఆశీర్వదించారు. ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కలనాయుడుబాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ చినరామునాయుడు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గబాబు, పలుగ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు నవదుర్గ పూజ



పూజలకు సిద్ధమైన నవదుర్గ అమ్మవార్లు

శృంగవరపుకోట: స్థానిక దార గంగమ్మ ఆలయంలో నవదుర్గలకు ఆదివారం పూజలు చేయనున్నట్లు ఆలయ అర్చకులు రాజగోపాలాచార్యులు శనివారం తెలిపారు. స్థానిక వేణు గోపాలస్వామి ఆలయ సేవా కమిటీ మహిళలు నవదుర్గల అమ్మవారి విగ్రహాలను సిద్ధం చేశారు.ఉదయం 9గంటలకు పూజాకార్యక్రమాలు ప్రారంభం కానున్నట్టు అర్చకులు చెప్పారు.

అన్నపూర్ణగా రాజరాజేశ్వరీదేవి



బొండపల్లి: దేవుపల్లి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అన్నపూర్ణా దేవిగా పూజలందుకుంటున్న అమ్మవారు



దత్తిరాజేరు: మరడాంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారు మూడోరోజు శనివారం భక్తులకు అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు దూసి శ్రీధర్ శర్మ అమ్మవారికి పంచామృతాభి షేకాలు చేశారు. అనంతరం భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు.

గాయత్రీదేవిగా...

దత్తిరాజేరు: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల్లో మూడో రోజు శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గడసాం,మరడాం, కోమటిపల్లి,పెదమానాపురం గ్రామాల్లోని మండపాల్లో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలి



మహిళా పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ దేవి

వేపాడ: గ్రామాల్లో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని, ఎవరైనా తగాదాలు సృష్టిస్తే తక్షణమే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సచివాలయ మహిళా పోలీసులకు వల్లంపూడి ఎస్ఐ బి.దేవి సూచించారు. వల్లంపూడి పోలీస్ స్టేషన్‌లో మండలంలోని గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో శనివారం ఆమె సమావేశమయ్యారు. గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలపై, అక్రమంగా మద్యం రవాణా, విక్రయాలపై నిఘా పెట్టాలని చెప్పారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా నేరాలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వెంటనే సమచారం అందించాలన్నారు.